క్లుప్తంగా

ప్రత్యేక ఆకర్షణగా 108 అడుగుల భారీ గణనాథుడు



దొండపర్తి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన 108 అడుగుల భారీ గణనాథుడు

వై.ఎస్. జగన్ యువసేన ఆధ్వర్యంలో దొండపర్తి రామాలయం వద్ద కొలువుదీరిన 108 అడుగుల భారీ గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఇక్కడ స్వామివారికి 21 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగదాంబ : పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను టాస్క్‌పోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నర్, అదనపు కమిషనర్ నాగేంద్రుడు ఆదేశాల మేరకు వన్‌టౌన్ పరిధి టౌన్‌కొత్తరోడ్డు వద్ద శ్రీకనకమహాలక్ష్మి టిఫిన్స్ హోటల్ పై అంతస్తులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శ్రీనాథరావు, టాస్క్‌పోర్స్ సిబ్బంది దాడులు చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 41,900 నగదు, 6 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు



సంపత్ వినాయగర్ ఆలయం వద్ద విధుల్లో ట్రాఫిక్ పోలీస్

సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయంలో సోమవారం నుంచి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక పూలతో స్వామి వారిని అలంకరించారు. సోమవారం ఉదయం 4 గంటలకు గణపతి హోమంతో వేడుకలు ప్రారంభిస్తారు. మొదటి రోజు స్వామి వారు సంపత్ వినాయగర్ అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

ఏకదంతం.. వివిధ రూపం

● వినాయక పూజలకు వేళాయే



సీబీఎం పాఠశాల వద్ద వరసిద్ధి వినాయక ఆలయం

దాబాగార్డెన్స్: వక్రతుండం.. మహారూపం.. ఏకదంతం.. ఇలా గణేశుడి రూపు అందరికీ సుపరిచితమే. ఆ విఘ్నేశ్వరుడు ఎన్నో రూపాల్లో పాతనగరంలోని వివిధ ప్రదేశాల్లో వెలసి పూజలందుకుంటున్నాడు. ఒక్కో చోట ఒక్కో విధంగా ప్రసిద్ధుడై భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

వైశాఖేశ్వరాలయం (బుచ్చిరామలింగేశ్వరాలయం)



వైశాఖేశ్వరాలయం

వైశాఖేశ్వరుని పేరిట ఈ ఊరికి విశాఖ అన్న పేరు స్థిరపడ్డ సంగతి తెలిసిందే. 14వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు బంగాళాఖాతం తీరంలో (కోస్టల్ బ్యాటరీ వద్ద) వైశాఖేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. దాని నమూనాతో ప్రస్తుతం కలెక్టరేట్ సమీపంలోని అఫీషియల్ కాలనీ మూడో వీధిలో పునర్నిర్మించిన ఆలయమే బుచ్చిరామలింగేశ్వర ఆలయంగా పేరు గాంచింది

వరసిద్ధి వినాయకుడు..



వరసిద్ధి వినాయకుడు

సీబీఎం హైస్కూల్ సమీపాన సుమారు 40 ఏళ్ల కిందట వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి చిన్న ఆలయం నిర్మించారు. ప్రతి బుధవారం సాయంత్రం స్వామికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేస్తారు. వరసిద్ధి వినాయకుడు కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. ప్రతినెలా ఆఖరి బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయి. దీంతో పాటు సంకటహర గణేష్ హోమం క్రమం తప్పకుండా చేస్తారు. స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

బెల్లం గణపతి..



అన్ని ఆలయాల్లో వినాయకుని తొండం కుడి వైపునకు తిరిగి ఉండడం విశేషం. వినాయకుని ఎదురుగా మోకాళ్లపై కూర్చుని తమ శక్తి మేర బెల్లం సమర్పిస్తానని మొక్కుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఈ వినాయకుడిని బెల్లం గణపతిగా పిలుస్తారు.

సిద్ధి వినాయక ఆలయం..

కురుపాం మార్కెట్ వద్ద గల పాతసాలిపేటలో ఉన్న ఆలయం నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటి. వందేళ్ల క్రితం ఈ ప్రాంతంలో నీటికి కరువు వచ్చినప్పుడు బావిని తవ్వుతుండగా వినాయకుని విగ్రహం బయటపడింది. విగ్రహానికి ఎడమ పార్శ్వం ఉండదు. విగ్రహ ప్రతిష్ట వెంటనే జరిగినా కాలక్రమంలో ఆలయాన్ని నిర్మించారు. పిల్లల వివాహాలకు ఆటంకాలు ఎదురైనప్పుడు, బిడ్డలు పుట్టడం ఆలస్యం అయినప్పుడు భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుని వినాయకునికి మొక్కుకుంటే కోర్కెలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు. ఈ ఆలయంలో భక్తులే స్వయంగా స్వామిని పూజించుకోవచ్చు.

లక్ష్మీ గణపతి ఆలయం..



ఏవీఎన్ కాలేజీ డౌన్‌లో వందేళ్ల కిందట ఈ ప్రాంతం అంతా కొండలు, గుట్టలమయంగా ఉన్న సమయంలో రాంబిల్లి సూర్యనారాయణ అనే వ్యక్తి ఇక్కడ స్థలం కొని ఇల్లు కట్టాడు. అనంతరం తమిళనాడుకు చెందిన పిళ్లై అనే సాధువుకు వినాయకుడు కలలో కనిపించి ఇక్కడ తవ్వితే తన విగ్రహం కనిపిస్తుందని చెప్పడంతో సూర్యనారాయణ సాయంతో తవ్వకాలు చేపట్టగా విగ్రహం కనిపించింది. విగ్రహ ప్రతిష్ట సమయంలో నాలుగు స్తంభాలతో గుడి నిర్మించారు. కాలక్రమంలో దీన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడ భక్తులు గణపతికి బెల్లం పానకంతో అభిషేకం చేస్తారు. ఆయన ముందు నిల్చుని గుంజీలు తీస్తారు.

మార్కెట్లకు చవితి సందడి



గణపతి బొమ్మలు కొనుగోలు చేస్తున్న యువతులు



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



అల్లిపురం మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్



పూర్ణామార్కెట్‌లో రహదారిపై ఉన్న వ్యాపారులను వెనక్కి పంపిస్తున్న ఏడీసీసీ శ్రీనివాసరావు

అల్లిపురం : మార్కెట్లు చవితి సందడి సంతరించుకున్నాయి. వినాయక చవితి అంటే ప్రకృతితో మమేకమయ్యే పండగ. ప్రకృతిని పూజించే పండగ కాబట్టి భక్తులు ముందుగా వినాయకుడిని మట్టి విగ్రహంతో పూజిస్తారు. సుమారు 21 పత్రాలతో పూజ చేస్తారు కాబటి మార్కెట్లో రకరకాల పత్రాలు కూడా వ్యాపారులు కుప్పగా పోసి అమ్ముతారు. మామూలు సమయంలో వాటిని కనీసం ముట్టుకోని వారు కూడా గణపతి పూజకు వాటిని భక్తిశ్రద్ధలతో కొనుగోలు చేయటం విశేషం. దీనిని అవకాశంగా తీసుకుని వ్యాపారులు వాటి ధరలు కూడా పెంచి అమ్మారు. ఒకప్పుడు రూ.10 విలువ చేసే పత్రిలను రూ.50కి విక్రయించారు. అదే విధంగా 21 రకాల పండ్లు ముఖ్యంగా యలంకాయ, మారేడు, కొబ్బరిపువ్వు ఇతర పండ్ల ధరలు పెరిగిపోయాయి. పువ్వులు ధరలు చెప్పనవసరం లేదు. డజను చామంతులు రూ.20 నుంచి రూ.30 అమ్మకాలు జరిపారు. అరటి ఆకులు ఒకటి రూ.5, డజను అరటి పండ్లు రూ.70 నుంచి రూ.100, కొబ్బరికాయ రూ.25 నుంచి రూ.40కు అమ్మకాలు జరిపారు. వినాయక బొమ్మలు కొనుగోలు చేసేందుకు ముఖ్యంగా చిన్నారులు సందడి చేశారు. రంగు రంగుల బొమ్మలు, వివిధ రూపాల్లో కనువిందు చేయటంతో ఏ బొమ్మ కొనాలో అన్న మీమాంసలో పడిపోయారు. బేరం కుదుర్చుకుని బొజ్జగణపతికి...జై అంటూ గణపతి బొమ్మతో ఆనందంగా తరలివెళ్లిన ఘటనలతో, అల్లిపురం కుమ్మరవీధి కళకళలాడింది.

కిటకిటలాడిన రోడ్లు..

వినాయక చవితి నేపథ్యంలో అల్లిపురం మెయిన్ రోడ్డు, సింహాలదేవిడి, అల్లిపురం మోడల్ స్కూలు, కెప్టెన్ రామారావు జంక్షన్ వద్ద వాహనాలు నిలిచిపోవటంతో పాదచారులు కూడా రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ రోడ్డుకు ఇరువైపులా గణపతి మండపాలు ఏర్పాటు చేయడం, దుకాణదారులు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పూర్ణామార్కెట్‌లో..

జగదాంబ: పూర్ణామార్కెట్ చవితి శోభ సంతరించుకుంది. పండగ నేపథ్యంలో మార్కెట్ బయట అధికంగా దుకాణాలు వెలిసాయి. పత్రి, పండ్లు, కొబ్బరి, చెరకు, పసుపు, కుంకుమ వ్యాపారులు జోరుగా అమ్మకాలు చేశారు. పువ్వుల ధరలు ఆకాశాన్ని అంటాయి. పూలు, టోపీలు, ప్లాస్టిక్ దండలు, పందిరి చక్రాలు ఎక్కువగా అమ్ముడుపోయాయి. అరటి పండ్లు డజను రూ.100 కంటే ఎక్కువ ధరకే అమ్మారు. ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో వినియోగదారులు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేసుకున్నారు. పోలీసుల ప్రత్యేక నిఘాతో దొంగతనాలు, ఆకతాయిల ఆటలు సాగలేదు.

నడిచేందుకు దారి లేకుండా..

● బంగారుమెట్టలో రోడ్డును ఆక్రమించి బిల్డింగ్ పనులు
● పాదచారులు, వాహన చోదకుల అవస్థలు



బంగారుమెట్ట జీవీఎంసీ స్కూలు వైపు పూర్తిగా మూసివేసిన రోడ్డు

అల్లిపురం : రోడ్డు ఆక్రమించి బిల్డింగ్ పనులు చేపట్టడంతో బంగారుమెట్టలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంగారుమెట్ట జంక్షన్‌లో రెండు రోడ్లలో ఆదివారం ఇసుక, పిక్క, సిమెంట్ బస్తాలు, మిల్లర్లతో ఆక్రమించడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నడిచేందుకు తోవ లేకపోవటంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో భవన నిర్మాణ పనులు జరుగుతుండటంతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

రోడ్డెక్కిన మురుగు



సింహాలదేవిడి వద్ద రోడ్డుపై మురుగు నీరు

అల్లిపురం : ఆదివారం ఉదయం అల్లిపురం మెయిన్ రోడ్డులో మోడల్ స్కూల్ నుంచి సింహాలదేవిడి జంక్షన్ వరకు మురుగు కాలువలో చెత్త పేరుకుపోవటంతో పెద్ద ఎత్తున మురుగునీరు రోడ్డుపైకి వచ్చింది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకల సమయంలో మురుగునీరు తుల్లటంతో మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మురుగునీరు దుర్వాసన వెదజల్లటంతో స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు. కాలువల నిర్వహణలో పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యం కారణంగానే కాలువల్లో చెత్త పేరుకుపోయిందని విమర్శలు వెల్లువెత్తాయి.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

విశ్వకర్మ పంచరాత్రి మహోత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలో విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ పంచరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ భగవానుని పంచలోహ ఉత్సవ విగ్రహానికి ఆ విగ్రహ దాత కోసూరి పాపారావు దంపతులచే విశేష పూజలు నిర్వహించి, అక్కడి నుంచి టౌన్‌హాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సంఘీయులు గోడి నరసింహాచారి, గోడి విజయలక్ష్మి దంపతులచే పతాకావిష్కరణ చేపట్టారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా విశ్వకర్మ భగవానుని విగ్రహాన్ని ఆవిష్కరింపజేసి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విశ్వకర్మ భగవానుని మహోత్సవం నిర్వహించడం యావత్ విశాఖకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురజాపు రవి, పండూరి శేఖర్, పక్కి కొండబాబు, రామోజు చినబాబు, ఈదలాడ శివ, పాటోజు ప్రసాద్, ముదపాక రవి, పెదగాడ గోపి, అలమండ శ్రీనివాసరావు, ధర్మవరపు వరంబాబు, కుప్పిలి మణి, ప్రకాష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

అల్లిపురం : విశ్వకర్మ జయంతి అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ సూకరాజు, పాఠకులు పాల్గొని ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

మట్టి విగ్రహాలే మేలు



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న సీతంరాజు సుధాకర్



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న నాయకులు



అమ్మవారివీధి కొత్తమ్మవారి దేవాలయం వద్ద..



మట్టి వినాయక ప్రతిమలు వాడాలని ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న కొణతాల



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం వద్ద మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న టూటౌన్ సీఐ తిరుమలరావు

అల్లిపురం : వినాయక చవితిని పురస్కరించుకుని పలు చోట్ల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, టూటౌన్ సీఐ బి.తిరుమలరావు పాల్గొని మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీలాపు అయ్యప్పరెడ్డి, గంగ, తాడి సత్యవతి, బేబి, శ్రీనివాస్, సూర్య, డాక్టర్ గంగాధర్, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారివీధిలో..

అమ్మవారివీధిలో కొత్తమ్మవారి దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, నీలాపు రమణారెడ్డి పాల్గొని మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బొడ్డేటి ప్రసాద్, కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

29వ వార్డులో..

మహారాణిపేట : జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సుమారు 500 మట్టి విగ్రహాలు ఉచితంగా పంపణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్డు నాయకులు కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, పల్లా రాధాలక్ష్మి, సారిపిల్లి వెంకటరమణ, ఒమ్మి కిషోర్, డొప్ప సూరి, అప్పలరాజు, చిన్న, సింగంపల్లి వెంకట్, పిల్ల గోవింద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్లకార్డుల ప్రదర్శన..

సీతమ్మధార: ఆశీలమెట్టలోని రోటరీ క్లబ్ వైజాగ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

వినాయక పూజతో సర్వం శుభకరం..

ఆశీలమెట్టలోని వేమన మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ హరివెంకటకుమారి మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం, మొక్కలు పంపిణీ చేశారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి. నారాయణరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఇరోతి ఈశ్వరరావు, కె.మురళీకృష్ణ, సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయం వద్ద తెలుగు సంస్కృతి ఆధ్వర్యంలో మట్టి వినాయ విగ్రహాలు పంపిణీ చేశారు. మా సంస్కృతి సామాజిక సేవా సంస్థ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత..

దాబాగార్డెన్స్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీగాయత్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్ప పుస్తకాలు అందజేశారు. విశ్వభారత్ బ్రాడ్ కాస్టింగ్ అధినేత రమేష్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొణతాల రాధ, కె. అప్పలనరసమ్మ, ఆలేటి హేమలత, జి. వెంకట్రావు, బి. లక్ష్మి, శ్రీహరి, స్వాతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్లూరి భరతలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

సనాతన సంప్రదాయాలు ఆచరించాలని ఏసీపీ వెంకట్రావు పిలుపునిచ్చారు. నగరంలోని రాంనగర్ మెయిన్ రోడ్డులో గల న్యూ భారత్ సప్లయర్స్ అనుబంధ సేవా సంస్థ చిట్లూరి భరతలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకం, తులసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలను అనుసరిస్తూ, పర్యావరణహితం కోరుతూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించడం వల్ల లోకానికి మంచి జరుగుతుందన్నారు. చిట్లూరి గిరిధర్ విజయలక్ష్మి దంపతులు, కల్నన్ రామన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, భీమశంకరశాస్త్రి, ఇంద్రగంటి కాళీపరసాద్ తదితరులు పాల్గొన్నారు.